క్లుప్తంగా

9న మెగా జాబ్ మేళా



నెహ్రూనగర్: స్మార్ట్ టెక్స్, జీఎంసీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని, అందులో భాగంగా ఈ నెల 9న స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మాక్ ఇంటర్వ్యూ, రిజిస్ట్రేషన్ జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలియజేశారు. గురువారం స్మార్ట్ టెక్స్ చైర్‌పర్సన్ దివ్యతో కలిసి జాబ్‌మేళా పోస్టర్‌ని నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో 10వ తరగతి పైన చదివిన నిరుద్యోగ యువతకు వారి అర్హతకు తగిన విధంగా 50 కంపెనీల నుంచి ఉద్యోగాలు అందించేలా జాబ్ మేళా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఐటీ, నాన్ ఐటీ, బ్యాంకింగ్, ఫార్మసీ, నర్సింగ్ రంగాల్లోని వివిధ కంపెనీలు పాల్గొంటాయని ఆయన తెలిపారు.

నర్సింగ్ సూపరింటెండెంట్ కిరణ్మయికి సన్మానం



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొంది విధుల్లో చేరిన చిలువూరి కిరణ్మయిని గురువారం మచిలీపట్నం జీజీహెచ్ గ్రేడ్ -1 నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆషా సజని ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని, నర్సింగ్ వృత్తికి వన్నె తెచ్చేలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు జీజీహెచ్ నర్సింగ్ అధికారులు, నర్సింగ్ సిబ్బంది, నర్సుల సంఘం నేతలు పాల్గొన్నారు.

నేటి నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీరాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను ఈనెల 4వ తేదీ నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.ఆంజనేయాచార్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం అంకురార్పణ, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచన, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, మంగళా శాసనం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 19 వరకు ప్రత్యేక అలంకారాలు ఉంటాయని వివరించారు.

మద్యానికి బానిసై తల్లి, భార్యకు వేధింపులు

లక్ష్మీపురం: మద్యానికి బానిసై డబ్బు కోసం తల్లి, భార్యను వేధిస్తున్న వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కొరిటిపాడు ప్రాంతానికి చెందిన తిరుమలశెట్టి రంగమ్మ నెయ్యి కొట్టులో పని చేస్తూ జీవనం సాగిస్తుంటుంది. ఆమె పెద్ద కుమారుడు శివ మద్యానికి బానిస అయి నిత్యం డబ్బులు కోసం వేధిస్తుంటాడు. గురువారం డబ్బులు ఇవ్వకపోవడంతో తల్లితో పాటు భార్య, పిల్లలను కొట్టాడు. గృహోపకరణాలు, నీటి పైపులు, తలుపులను ధ్వంసం చేశాడు. పైగా చంపుతానని బెదిరింపులకు దిగాడు. దీంతో తల్లి రంగమ్మ దిక్కుతోచక అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తాగుతున్న నలుగురి అరెస్టు

లక్ష్మీపురం: గంజాయి తాగుతున్న నలుగురు యువకులను పట్టాభిపురం పోలీసులు గురువారం రాత్రి అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజ్జనగుండ్ల ప్రాంతంలోని షేక్ నాగుల్ షరీఫ్, యూసుఫ్‌ఖాన్, వినోద్, సంజయ్ అనే నలుగురు యువకులు గంజాయి తాగుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు నలుగురిని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారించారు. వారి వద్ద 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

లక్ష్మీపురం: కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులను తీర్చలేక పోతున్నానంటూ మనోవేదనతో ఎలుకల మందు తిని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. కోబాల్ట్‌పేట 5వ లైన్‌కు చెందిన పెమ్మసాని జనార్దన్ (34) బిర్యానీ పాయింట్‌లో వెయిటర్‌గా పని చేస్తాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పులతో సతమతమవుతూ మనోవేదనతో బుధవారం ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం పోలీసులు ఆసుపత్రికి వెళ్లి జనార్దన్ నుంచి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. అయితే, గురువారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఎంజాయ్‌తో జీవితాలు నాశనం

- ఏరులై పారుతున్న మద్యం
- బానిసలవుతున్న యువత
- జీవితాలపై తీవ్ర ప్రభావం
- మత్తులో నేరాలు
- అవగాహనతోనే నియంత్రణ



పొన్నూరు రోడ్డులో నడి రోడ్డుపై కూర్చుని మద్యం తాగుతున్న మందుబాబులు

పట్నంబజారు: మత్తు మనిషిని విచక్షణ కోల్పోయేలా చేస్తోంది. నిషాలో ఏం చేస్తున్నారో తెలియని స్థితిలో జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొందరు నేరాలకు పాల్పడుతుంటే మరికొందరు అనారోగ్యం పాలై, కుటుంబ సమస్యలతో అర్ధంతరంగా ఆయువు తీసుకుంటున్నారు. ఇంకొందరు రోడ్డు ప్రమాదాల్లో తనువు చాలిస్తున్నారు. మత్తులో అఘాయిత్యాలకూ వెనుకాడటం లేదు.

నగరంలో ఇటీవల జరిగిన మందుబాబుల ఆగడాలు

- నాలుగు రోజుల కిందట గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న మోడరన్ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఐదుగురు యువకులు పార్కింగ్ విషయంలో ఘర్షణ పడి తండ్రీకొడుకులను మద్యం మత్తులో తీవ్రంగా కొట్టి గాయపరిచారు.
- చిలకలూరిపేటకు చెందిన వంశీకృష్ణ అనే యువకుడు వారం రోజుల కిందట మద్యం మత్తులో విజయ టాకీస్ నుంచి భగత్‌సింగ్ బొమ్మ సెంటర్ వరకు డ్రైవింగ్ చేస్తూ.. అనేక వాహనాలను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.
- కొద్ది రోజుల కిందట కోబాల్టుపేట వద్ద ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. కానిస్టేబుల్ వాహనాన్ని ఢీకొట్టారు. గాయపడిన కానిస్టేబుల్ చికిత్స పొందుతున్నాడు.
- ఏటుకూరు బైపాస్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో కూడా ముగ్గురు యువకులు మద్యం మత్తులోనే మృతి చెందారని పోలీసులు పేర్కొన్నారు.
- అంకిరెడ్డిపాలెంలోని ఓ వైన్స్ షాపు వద్ద అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడ్డారు. ఈ సమయంలో ఒక వ్యక్తి మరో వ్యక్తిని రాయితో విచక్షణరహితంగా కొట్టడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు.
- పాత గుంటూరు పరిధిలో ఓ జంట ఇష్టపడి ప్రేమ వివాహం చేసుకుంది. భర్త మద్యం తాగుతున్నాడనే కోపంతో భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటు చేసుకుంది.

అడ్డూఅదుపు లేకుండా అమ్మకాలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మద్యం ఏరులై పారుతోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా అర్ధరాత్రులు సైతం యథేచ్ఛగా అమ్మకాలకు తెరదీసింది. గుడి, బడి అనే తేడా లేకుండా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో పలు దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గుంటూరు నగరంలో వైన్ షాపులు ఈస్ట్- 14, వెస్ట్‌లో- 19 ఉన్నాయి. బార్ అండ్ రెస్టారెంట్లు ఈస్ట్‌లో- 34, వెస్ట్‌లోనూ -34 ఉన్నాయి. వీటి పరిధిలో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో సర్కారు మద్యం దుకాణాల ద్వారా నిర్ణీత వేళల్లోనే విక్రయాలు సాగేవి. అనధికార మద్యం విక్రయాలు జరగకుండా సెబ్ పటిష్ట చర్యలు తీసుకుంది. మత్తు పదార్థాల వినియోగంపై విద్యాసంస్థల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. దీంతో నేరాలు గణనీయంగా తగ్గాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించింది. సెబ్‌ను రద్దు చేసి, ఎక్సైజ్‌లో కలిపివేయడంతో వారికి వరంగా మారింది. అధిక శాతం మద్యం దుకాణాలు కూటమి నేతలు, వారి అనుచరులవి కావడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చదువుకోవాల్సిన వయస్సులో విద్యార్థులు, యువత మత్తుకు బానిసలుగా మారుతున్నారు.

విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరం

మద్యం, మత్తు పదార్థాల వల్ల జరిగే దుష్పరిణామాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాలి. మరోవైపు మద్యం, మత్తు పదార్థాలకు బానిసలైన వారిని సకాలంలో గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పించడం ద్వారా ఫలితాలుంటాయని వైద్యులు పేర్కొంటున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడుతుండటంతో వారు దారి తప్పుతున్నారు. పుట్టిన రోజులు, పరీక్షల్లో పాసయ్యామని, ఉద్యోగం వచ్చిందని ఇలా ప్రతి విషయంలో పార్టీల్లో మత్తుకు అలవాటుపడుతున్నారు. ఎంజాయ్ ముసుగులో చెడు వ్యసనాలకు బానిసలై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మత్తుకు బానిసలైన వారు నగదు కోసం దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్నారు. మత్తులో అఘాయిత్యాలకు కూడా వెనుకాడటం లేదు. వివాహమై సంతానం ఉన్న వారు కూడా కుటుంబ బాధ్యతలను విస్మరిస్తున్నారు. మద్యం తాగుతూ ఆరోగ్యం చెడగొట్టుకుంటున్నారు. అప్పుల పాలై అర్ధంతరంగా తనువు చాలించి అయిన వారిని అగాథంలోకి నెట్టేస్తున్నారు. పోలీసులకు వివిధ కేసులతోపాటుగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడుతున్న వారిలో అధిక శాతం 18 నుంచి 25 ఏళ్ల లోపు వారు ఉండటంతో ఆందోళన కలిగిస్తోంది. దుకాణాల్లో మైనర్లకు మద్యం విక్రయించకూడదనే నిబంధన ఉన్నా ఇది ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. ఎక్సైజ్ అధికారులు స్పందించి విచ్చలవిడి విక్రయాలను సైతం కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వృద్ధుడికి చేయూత

మానవత్వం చాటుకున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా



వృద్ధుడిని ఆశ్రమంలో చేర్పిస్తున్న నూరి ఫాతిమా

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మానవత్వాన్ని చాటుకున్నారు. ఏలూరు ప్రాంతానికి చెందిన బలంకి అప్పారావు (79) అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. చూసేవారు లేక ఇబ్బందులు పడుతున్నాడు. సమాచారం తెలుసుకున్న నూరి ఫాతిమా ఆయనకు అండగా నిలిచారు. పాత గుంటూరులోని ఆర్‌ఆర్ మూర్తి వృద్ధుల సేవా సంస్థలో చేర్పించారు. తానే గార్డియన్‌గా ఉంటానని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ ఆర్.ఆర్. మూర్తి వృద్ధుల సేవా సంస్థ శ్రద్ధ, వైద్య సేవలు చూసి వృద్ధుడిని ఇక్కడ చేర్పించినట్లు తెలిపారు. గతంలో తన తండ్రి మాజీ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కూడా ఐదుగురిని ఇక్కడ చేర్పించినట్లు చెప్పారు. వృద్ధుడి పూర్తి బాధ్యతలు తానే స్వీకరిస్తానని ఆమె తెలిపారు.

రోడ్ల విస్తరణకు ప్రజలు సహకరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలసి మాట్లాడుతున్న నగర్ కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: బొంగరాల బీడు నుంచి వసంతరాయపురం మీదుగా శారదా కాలనీ వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డును 60 అడుగులుగా విస్తరించాల్సిన అవరం ఎంతైనా ఉందని, దీనికి స్థానికులు కూడా సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. ఆయన గురువారం తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలిసి కౌన్సిల్ సమావేశ మందిరంలో విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ త్వరలో శంకర్ విలాస్ ఆర్‌ఓబీ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో 60 అడుగుల రోడ్డుగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. విస్తరణ వల్ల ఈ ప్రాంతంలో 201 ఆస్తులు ఎఫెక్ట్ అవుతున్నాయని వెల్లడించారు. ఇందులో 158 ప్రైవేట్ ఆస్తులు, రెండు జీఎంసీ, నాలుగు ఖాళీ స్థలాలు, రెండు స్వాధీన అగ్రిమెంట్లు, ఏడు మతపరమైనవి, మూడు బీ ఫారమ్స్, 25 ఏఈఎల్‌సీ ఆస్తులు ఉన్నాయని వివరించారు. వీటికి సంబంధించిన డాక్యుమెంట్స్ నగర పాలక సంస్థ అధికారులకు అందిస్తే, నష్టపరిహారం లెక్క కడతారని తెలిపారు. టీడీఆర్ బండ్లను వీలైనంత త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. విస్తరణపై సందేహాలుంటే టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో కొన్నేళ్లుగా అభివృద్ధి పనులు పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శంకర్ విలాస్ ఆర్‌ఓబీ పనులు ప్రారంభమైతే నగరంలో ఈస్ట్ నుంచి వెస్ట్ కురాకపోకలు కష్టమవుతాయని చెప్పారు. దాని ప్రభావం ప్రజలపై పడకుండా మిగిలిన రోడ్లు విస్తరిస్తే ట్రాఫిక్ రద్దీ తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం గుంటూరు నగరంలో ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతాయని, అందుకు తగ్గట్టుగా రోడ్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం రోడ్డు విస్తరణకు సంబంధించి ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజల సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరించారు. సమావేశంలో సిటీప్లానర్ రాంబాబు, ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డీసీపీ సూరజ్ పాల్గొన్నారు.

చెత్త కనిపిస్తే సిబ్బందిపై చర్యలు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడైనా చెత్త కనిపిస్తే సంబంధిత శానిటేషన్ కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్లే బాధ్యత వహించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆయన గురువారం జీఎంసీ మెయిన్ ఆఫీస్‌లో అదనపు కార్మికుల హాజరు పరిశీలించారు. అనంతరం రాజాగారి తోట, కొత్తపేట, కాకుమానువారితోట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సమస్యాత్మక ప్రాంతాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌కు అదనపు కార్మికులు, వాహనాలని వినియోగించుకోవాలని తెలిపారు. బిన్లు, పుష్ కాట్స్ ఇప్పటికే డివిజన్ల అవసరాల మేర అందించామని, ఇంకా ఎక్కడైనా కావాల్సి ఉంటే వెహికిల్ షెడ్ నుంచి తెప్పించుకోవాలని ఆదేశించారు. సోమవారం నుంచి నగరంలో ఎక్కడా చెత్త కుప్పలు ఉండడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రజారోగ్య కార్మికులు కొందరు ఇంకా పలు డివిజన్లలో సూపర్‌వైజర్ల పేరుతో పారిశుద్ధ్య పనులు చేయకుండా ఉంటున్నారని, వారికి తక్షణం విధులు కేటాయించాలని తెలిపారు. తమ పర్యటనల్లో గుర్తిస్తే ఇన్‌స్పెక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అనంతరం కొత్తపేట, కాకుమానువారి తోటల్లో పలు ప్రాంతాల్లో పర్యటించి, స్థానికులతో మాట్లాడారు. నగర ప్రజలు కూడా ఇళ్లల్లో వ్యర్థాలను తడిపొడిగా వేరు చేసి ఇవ్వాలని ఆయన సూచించారు. వ్యర్థాలను రోడ్ల మీద, కాల్వల్లో వేసే కమర్షియల్ సంస్థలపై భారీ అపరాధ రుసుం విధించాలని ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. రాత్రిపూట టిఫిన్ బండ్లు, చిరు వ్యాపారులు రోడ్ల మీద వ్యర్థాలు వేసి వెళ్తున్నారని, అటువంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బయాలజిస్ట్ రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆటిజం ముందస్తు గుర్తింపుతో మెరుగైన జీవితం



బాలికను పరీక్షిస్తున్న డాక్టర్ సుజిత

గుంటూరు మెడికల్: ఆటిజాన్ని ముందస్తుగా గుర్తించడం ద్వారా పిల్లల్లో మెరుగైన జీవితాన్ని పెంపొందించవచ్చని పాజిటివ్ రిహాబ్ సెంటర్ నిర్వాహకులు, ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పెథాలజిస్ట్ డాక్టర్ చేబ్రోలు సుజిత అన్నారు. వరల్డ్ ఆటిజం డే సందర్భంగా స్థానిక చంద్రమౌళీనగర్‌లోని సెంటర్‌లో గురువారం తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజిత మాట్లాడుతూ ఆటిజాన్ని బాల్యంలోనే గుర్తిస్తే సరైన చికిత్స అందించవచ్చని పేర్కొన్నారు. థెరపీ ద్వారా పిల్లల సామర్థ్యాన్ని కూడా పెంచవచ్చని తెలిపారు. పిల్లలు ఇతర పిల్లలతో కమ్యూనికేషన్‌లో లోపం, పరస్పర సంబంధాల్లో అవగాహన లోపం, పునరావృతంగా చేసే చర్యలు, ఆటలు, దృష్టిలో సమస్యలు, కొన్ని ప్రత్యేకమైన విషయాలపై ఎక్కువ మక్కువ చూపిస్తుంటే ఆటిజం లక్షణాలుగా గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పలువురు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

‘రుణ’ బాధలు ఇంతింత కాదయా ...!



ఉదయం 11 గంటలకు కూడా ప్రారంభం కాని ఇంటర్వ్యూలు



ఖాళీగా దర్శనమిస్తున్న టెంట్లు

- దరఖాస్తుదారులకు చుక్కలు
- బీఆర్ స్టేడియంలో ఎండలో అవస్థలు
- 3,141 మందికి గానూ 1500 మాత్రమే హాజరు
- తమ వారిని ఫోన్లు చేసి పిలిపించుకున్న కూటమి నేతలు

నెహ్రూనగర్: బీసీ కార్పొరేషన్ ద్వారా గురువారం తూర్పు నియోజకవర్గ పరిధిలో సబ్సిడీ రుణాల దరఖాస్తులను పరిశీలించడానికి బీఆర్ స్టేడియంలో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు. క్యాంప్‌లో సరైన వసతులు లేకపోవడంతో దరఖాస్తుదారులతో పాటు ఉద్యోగులు ఎండలో మండిపోయారు. అధికారులు షామినాలు ఏర్పాటు చేసి దులుపుకున్నారు. ఉదయం 10 గంటలకు కల్లా రావాలని నగరపాలక సంస్థ అధికారులు సూచించడంతో దరఖాస్తుదారులు ముందే స్టేడియం వద్దకు చేరుకున్నారు. అధికారులు మాత్రం తీరిగ్గా ఉదయం 11 గంటలకు వచ్చారు. శిబిరం వద్ద కూటమి నేతలు తిష్ట వేశారు. దగ్గరుండి తమ అనుకునే వారికి ఫోన్లు చేసి మరి పిలిపించుకున్నారు. వారి పేర్లను ఎమ్మెల్యే కార్యాలయానికి పంపించినట్లు సమాచారం.

సగం మంది కూడా హాజరుకాని దరఖాస్తుదారులు

గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి 3,141 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో గురువారం సాయంత్రానికి 1,500 మాత్రమే వచ్చినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. కనీసం క్యాంప్‌ను రెండు రోజులు పెట్టిన బాగుండేది కదా అని పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో దరఖాస్తుల పరిశీలన

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియంలో క్రెడిట్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు కాపీ, విద్యార్హతలు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్ బుక్, పాన్, ఆధార్ కార్డుల ఫొటోస్టాట్ కాపీలు, ఒక పాస్‌పోర్ట్ ఫొటోతో హాజరుకావాలని ఆయన సూచించారు

ఎమ్మెల్సీగా నిజాయతీ, నిబద్ధతతో పని చేశా !

మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణరావు

లక్ష్మీపురం: గత 14 ఏళ్లుగా పీడీఎఫ్ ఎమ్మెల్సీగా రాజ్యాంగ లక్ష్యాలకు కట్టుబడి నిజాయతీ, నిబద్ధతతో పని చేశానని మాజీ ఎమ్మెల్సీ కె.యస్ లక్ష్మణరావు అన్నారు. అన్ని రంగాల ప్రజల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి అలు పెరగని కృషి చేశానని తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీగా పని చేసిన ఈ సుదీర్ఘ కాలం చాలా సంతృప్తినిచ్చిందని, సహకరించిన అనేక సంఘాలకు వివిధ రంగాల ప్రముఖులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీగా లక్ష్మణరావు సేవలు, అంకిత భావాన్ని సంస్థ సభ్యులు సీహెచ్.సుశీల, హనుమంతరెడ్డి, ప్రొఫెసర్ వేణుగోపాలరావు, ఆర్.వి.సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, జొన్నలగడ్డ రామారావు, తాండవ కృష్ణ అభినందించారు.

ట్రంప్ సుంకాల చదరంగంతో అమెరికాకే నష్టం

లక్ష్మీపురం: ట్రంప్ ఆడుతున్న సుంకాల చదరంగం వల్ల అంతిమంగా అమెరికాయే నష్టపోతుందని అర్థశాస్త్ర అధ్యాపకులు సీహెచ్. సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రంప్ సుంకాలను ఎదుర్కోవడానికి ప్రపంచ దేశాలన్నీ ఏకమవుతున్న నేపథ్యంలో అగ్రరాజ్యం పరపతిని పణంగా పెట్టి ట్రంప్ ఆటలాడుతున్నారని తెలిపారు. విశ్లేషకులు ముప్పాళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ ఇప్పటికే జీవన వ్యయం పెరిగి అమెరికా ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్త పరిస్థితుల్లో ఉందన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్ ఎస్.సదాశివం, విద్యావేత్త ఈ.చంద్రయ్య పాల్గొన్నారు.

విశిష్ట మహిళలకు సత్కారం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై గురువారం గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో పెద్ది సాంబశివరావు పర్యవేక్షణలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలను సత్కరించారు. సభకు హిందీ అధ్యాపకురాలు కె.మంజుల అధ్యక్షత వహించారు. ఎం.వి.సత్యవతి (విద్య, ఆధ్యాత్మిక రంగం), అమ్మన విజయలక్ష్మి, (నాటక రంగం), బెండపూడి లక్ష్మీకుమారి (హరికథ భాగవతారిణి)లను సత్కరించారు. అనంతరం ఎం.వి. సత్యవతి ఆధ్యాత్మిక ప్రసంగం, అమ్మన విజయలక్ష్మి పద్య పఠనాన్ని చేశారు. నాట్యాచార్య కాజ వెంకట సుబ్రహ్మణ్యం శిష్యుల కూచిపూడి నృత్త ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో గుంటుపల్లి అరుణకుమారి, గుళ్లపల్లి స్వాతి, అర్థలపూడి నేహ, మంత్రవాది విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థినికి ఉగాది పురస్కారం ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్: తెలంగాణ రాష్ట్రంలో ‘సర్వేజన సుఖినో భవంతు ’ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన విశ్వావసు ఉగాది జాతీయస్థాయి పురస్కారాల్లో గుంటూరు నగరంలోని కెనడీ నెక్స్‌జెన్ పాఠశాల విద్యార్థిని ఉగాది పురస్కారం అందుకుంది. పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న ఇమ్మడిశెట్టి జాన్వితకు కూచిపూడి నాట్య బాల కళాకాణిగా ఉగాది పురస్కారం అందజేశారు. గురువారం ఆమెను పాఠశాల డైరెక్టర్‌లు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శ్రీవిద్య, ప్రిన్సిపాల్ కె.వసంతలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో ఉన్నతస్థాయికి ఎదగాలి



విద్యార్థులతో జూపూడి రంగరాజు, మధుసూదనరావు, నాగభూషణం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుని ఫార్మా రంగంలో ఉన్నతస్థాయికి ఎదగాలని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో డీ.ఫార్మసీ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ గురువారం జూనియర్ విద్యార్థులు ఫేర్‌వెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జూపూడి రంగరాజు మాట్లాడుతూ డీ.ఫార్మసీ విద్యార్థులు ఈ-సెట్ ప్రవేశ పరీక్ష ద్వారా బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ వంటి ఉన్నత విద్యా కోర్సుల్లో అత్యుత్తమ ర్యాంకులను సాధించాలని ఆకాంక్షించారు. తద్వారా జీవితంలో ఉన్నతస్థాయిలో స్థిరపడాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు మాట్లాడుతూ డీ.ఫార్మసీలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులతో పాటు ఈఎస్ఐ, సీజీహెచ్‌ఎస్, రిటైల్ సేల్స్ రంగాలు, ఫార్మా పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి. నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ ఏ. ప్రత్యూష, ఫార్మా డీ డైరెక్టర్ పి. సీతారామయ్య, అధ్యాపకులు వి. సుధారాణి, ఎస్. మేఘన సంధ్య, టి. మేరీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైన్ షాపు ఏర్పాటును అడ్డుకున్న స్థానికులు



పట్నంబజారు: నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నందివెలుగు రోడ్డులోని జెండా చెట్టు సెంటర్ సమీపంలో లక్కీ వైన్స్ పేరుతో గురువారం రాత్రి విక్రయాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో స్థానికులు ఇళ్ల మధ్య షాపు ఎలా ఏర్పాటు చేస్తారంటూ ఆందోళనకు దిగారు. ధర్నా చేపట్టి, పెద్దఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు అక్కడకు చేరుకుని వైన్స్ నిర్వాహకులు, స్థానికులకు సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం కనబడలేదు. నియోజకవర్గ ఎమ్మెల్యే వచ్చి సమాధానం చెప్పాలంటూ స్థానికులు భీష్మించి కూర్చున్నారు. గంట తరువాత ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అక్కడకు చేరుకున్నారు. వైన్స్ షాపు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటానని స్థానికులకు చెప్పడంతో వివాదం సద్దు మణిగింది.